అనురాగ్ యూనివర్సిటీలో ఐవైఎం-2023



ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆ యూనివర్సిటీ ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్–2023 ప్రోగ్రామ్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు మిల్లెట్స్‌పై విద్యార్థులకు, యూనివర్సిటీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఉపన్యాసాలు, పోస్టర్ ప్రెజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఎన్‌సీసీ క్యాడెట్లకు అధికారి డాక్టర్ మల్లేశ్ బహుమతులు అందజేశారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు



దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపేయాలని కోరుతూ గురువారం దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్‌రెడ్డి కమిషనర్ రాజమల్లయ్యకు ఫిర్యాదు చేశారు. ప్రగతినగర్ కాలనీలో బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకుడు జీ ప్లస్–2 అనుమతి తీసుకొని జీ ప్లస్–5 నిర్మాణం చేపట్టాడని, సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ నిర్మాణ పనులను నిలిపివేయాలని ఫిర్యాదు చేశారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ నిధులను వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులోని వినాయకనగర్ కాలనీలో రూ.10 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టి అన్ని మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు ఆదం షఫిక్, కాలనీ అసోషియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్ నిర్మాణానికి సహకరించాలని వినతి



ఎంపీ లక్ష్మణ్‌కు వినతి అందజేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డు మైసమ్మ గుట్ట వద్ద, అన్నోజిగూడ ఎన్టీపీసీ చౌరస్తా వద్ద అండర్ పాస్ రోడ్డు నిర్మాణానికి సహకరించాలని ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కోవా లక్ష్మణ్‌కు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఢిల్లీలోని ఎంపీ నివాసంలో గురువారం కలిసి లేఖ అందజేశారు. అలాగే జాతీయ రహదారి నుంచి అవుషాపూర్ వీబీఐటీ కళాశాలకు వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మించాలని కోరారు. స్పందించిన ఆయన బ్రిడ్జీల నిర్మాణంపై ప్రత్యేక చొరవ చూపాలని కేంద్ర ఉపరితల రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరికి లేఖ అందజేశారు.

చెప్పినా.. వినకపోతే ఇలాగే..



తుమ్మ చెరువు కట్టపై చెప్పులతో దండలు

మేడ్చల్: మనిషి కో మాట.. గొడ్డుకో దెబ్బ అంటారు.. చెడు పనులు చేయవద్దని చెబుతుంటారు పెద్దలు. మేడ్చల్ పట్టణంలోని తుమ్మ చెరువులో చెత్త వేయవద్దని మున్సిపల్ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా, చెత్త వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నా, కాలనీలు ఉన్న చోట చెరువు చుట్టూ జాలీలు ఏర్పాటు చేసినా బాధ్యత లేనివారు కొంతమంది చెరువులో యథేచ్ఛగా చెత్త వేస్తూ నీటిని కలుషితం చేస్తున్నారు. ఎంత చెప్పినా వినకపోడంతో కొంత మంది చెప్పుల దండలు ఏర్పాటు చేశారు. చెత్త వేస్తే చెప్పుదెబ్బలే అనేలా అర్థం వచ్చేలా తాడుకు చెప్పులను వేలాడదీశారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

కుషాయిగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. చర్లపల్లి డివిజన్, నాగర్జుననగర్ కాలనీ రోడ్డు నంబర్–5లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. అధికారులు పనులను పర్యవేక్షించి సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. అభివృద్ధి పనుల పేరుతో స్థానికులకు ఇబ్బందులు కలిగించకూడదన్నారు. ఇటీవలే కాలనీలో యూజీడీ, వాటర్‌లైన్ పనులు పూర్తి కావడంతో నూతనంగా రోడ్డు వేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఏఈ స్వరూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఆపండయ్యా బండి..

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేదెన్నడు..?

- ఏళ్లుగా తప్పని ఎదురుచూపులు
- ఘట్‌కేసర్‌లో ఆపాలంటూ వినతి
- పట్టించుకోని నాయకులు, అధికారులు



ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని దశాబ్దాలుగా ప్రయాణికులు కోరుతున్నారు. నాయకులు, ప్రభుత్వాలు మారుతున్నా రైలు ప్రయాణికుల సమస్యలు తీరడం లేదు. స్థానికంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపివేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నా ఏ ఒక్క ఎక్స్‌ప్రెస్ ఆగడం లేదు. ఘట్‌కేసర్ నుంచి ప్రధానంగా ఉత్తర, దక్షిణ భారతదేశం వెళ్లే రైళ్లన్నీ ఇదే ట్రాక్‌పై వెళ్తుంటాయి. దక్షిణ మధ్యరైల్వే కేంద్రం సికింద్రాబాద్ నుంచి నిత్యం సుమారుగా వందకు పైగా రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. గ్రామంగా ఉన్న ఘట్‌కేసర్ మున్సిపాలిటీగా మారినా, కళ్లెదుట ట్రాకుపై నిత్యం వందల రైళ్లు పరిగెడుతున్నా వాటిని చూడటం తప్ప స్థానిక రైల్వే స్టేషన్‌లో ఎక్కేందుకు అవకాశం లభించడం లేదు.

సమయం, డబ్బు వృథా..

ఘట్‌కేసర్ మండలంలో 20కి పైగా ఇంజినీరింగ్ కళాశాలలు, ఎంబీఏ, వైద్య, వ్యవసాయ కళాశాల, ఇన్ఫోసిస్, రహేజా, జెన్‌ప్యాక్ వంటి అంతర్జాతీయ వ్యాపార సంస్థలు ఇక్కడ కొలువుదీరి ఉన్నాయి. దినదినాభివృద్ధి చెందడంతో వందలాది కాలనీలు ఏర్పడ్డాయి. మెరుగైన సౌకర్యాలు ఉండటంతో మండల ప్రజలే కాకుండా సరిహద్దు ప్రాంతాల ప్రజలు ఘట్‌కేసర్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి రైలు రవాణా సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ వరంగల్‌కు వెళ్లే పుష్‌పుల్, రేపల్లె రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. ఇటు తిరుపతి, అటు ఢిల్లీ వైపు, మహారాష్ట్ర వైపు వెళ్లే రైళ్లు కళ్లముందరే వెళ్తున్నా 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. స్థానికంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయకపోవడంతో ప్రయాణికుల సమయం, డబ్బు వృథా అవుతుందని అంటున్నారు. నగరంలోని ట్రాఫిక్‌తో సమయానికి చేరుకోలేక ప్రయాణికులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా స్థానికంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాప్ ఏర్పాటు చేయాలి



ఘట్‌కేసర్ వాసులకు ఎక్స్‌ప్రెస్ రైళ్ల సౌకర్యం కల్పించడంలో రైల్వే అధికారులు, స్థానిక నాయకులు విఫలమయ్యారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా రైలు రవాణా సౌకర్యం పెంచాల్సిన బాధ్యత వారిపై ఉంది. స్థానికంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– కరుణాకర్‌యాదవ్, ఘట్‌కేసర్

సికింద్రాబాద్ వెళ్లాల్సి వస్తోంది..



ఘట్‌కేసర్ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపకపోవడంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ప్రయాణికులకు డబ్బు, సమయం వృథా అవుతోంది. ప్రయాణికుల సౌకర్యం కోసం ఘట్‌కేసర్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి. ఈ విషయంపై అధికారులు, నేతలు స్పందించాలి.

– బర్ల రాధాకృష్ణముదిరాజ్, ఘట్‌కేసర్

నేటి నుంచి స్పోర్ట్స్‌మీట్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత తెలిపారు. టెక్ ట్రోఫీ–2023 పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించనున్న స్పోర్ట్స్ మీట్‌ను మల్లారెడ్డి గ్రూప్స్ డైరెక్టర్ శాలినీరెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు. క్రీడలతో విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ధృడంగా మారతారని తెలిపారు. క్రీడాకారులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొననున్నట్లు తెలిపారు.

మేడ్చల్ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు బస్సులు

మేడ్చల్: మేడ్చల్ నుంచి వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం నగరంలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రత్యేక బస్సులు నేటి నుంచి నడిపిస్తున్నట్లు మేడ్చల్ ఆర్టీసీ డీపో మేనేజర్ సుధాకర్ తెలిపారు. 229/95ఏ రూట్‌తో మేడ్చల్, కొంపల్లి, సుచిత్ర, ప్యారడైజ్, ట్యాంక్‌బండ్, నాంపల్లి, అఫ్జల్‌గంజ్, శివారంపల్లి, ఆరాంఘర్, శంషాబాద్ మీదుగా ఎయిర్‌పోర్ట్ వరకు నిత్యం 5 సర్వీసులు నడిపిస్తున్నట్లు తెలిపారు. మేడ్చల్ నుంచి ఉదయం 5.45, 6.35, 7.25, 8.15, 9.05 సుచిత్ర నుంచి ప్రతి 50 నిమిషాలకోసారి బస్సులను నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పాన్‌డబ్బా తొలగించాలని వినతి

మౌలాలి: డివిజన్‌లోని సుధానగర్ కాలనీలో రోడ్డు మీద ప్రభుత్వానికి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించి పాన్ డబ్బా పెట్టారని, దానిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ గున్నాల సునీతయాదవ్‌కు సుధానగర్ కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. పాన్ డబ్బా కారణంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు.

‘డబుల్’ ఇళ్ల ప్రగతిపై ప్రతివారం సమావేశం

మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ జిల్లాలోని శాసనసభ నియోజకవర్గాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసమూర్తి, పంచాయతీరాజ్ ఈఈ సుమేధా, ఆర్డీవోలు శ్యాంప్రకాశ్, రాజేశ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్‌ఎంసీ), సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు పడక గదుల నిర్మాణాలకు సంబంధించి అన్ని వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఏమాత్రం పెండింగ్ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు ఎన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తయ్యాయి..? ఎన్ని ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు..? ఇంకా ఎన్ని ఇళ్లు ఏ దశలో పెండింగ్ పనులు ఉన్నాయి? ఫినిషింగ్ దశలో ఎన్ని ఉన్నాయనే పూర్తి వివరాలను నియోజకవర్గాల అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అందజేసే డబుల్ ఇళ్లను తప్పకుండా అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం అందజేయాలని సూచించారు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల కేటాయింపులకు సంబంధించిన వివరాలు, పంపిణీ ప్రక్రియను తెలుసుకున్నారు. రాజీవ్ గృహకల్ప ఇళ్లపై ఆయన ఆరా తీశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అధికారులు డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై పూర్తిస్థాయిలో మానిటరింగ్ చేయాలని పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని, సమావేశానికి అధికారులు సమగ్ర సమాచారంతో తప్పకుండా హాజరుకావాలన్నారు. అర్హులకు అందజేయనున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు శ్యామ్ ప్రకాశ్, రాజేశ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్‌ఎంసీ) అధికారులు పాల్గొన్నారు.

చర్చిని కూల్చడం హేయమైన చర్య



కూల్చివేసిన చర్చిని పరిశీలిస్తున్న మేయర్ కావ్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో రెండు సంవత్సరాల క్రితం నిర్మించిన చర్చిని అక్రమ నిర్మాణం పేరుతో రెవెన్యూ అధికారులు అకారణంగా కూల్చడంతో గురువారం మేయర్ మేకల కావ్య, బీఆర్ఎస్ కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాల పేరుతో అడ్డగోలుగా కూల్చివేతలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనిపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా క్రిస్మస్ పండగ ముందు ప్రార్థనలు చేసుకోకుండా చర్చిని కూల్చివేయడం హేయమైన చర్యన్నారు. చర్చి నిర్మాణానికి సహాయం చేస్తామన్నారు. అధికారులు ఇలాంటి దుర్మార్గపు చర్యలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆలూరి సంగీతరాజశేఖర్, నాయకులు సతీష్‌గౌడ్, క్రిష్టియన్ సోదరులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ చేతిలోంచి బ్యాగ్ చోరీ

- దుండగుడిని పట్టుకున్న స్థానికులు
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఘట్‌కేసర్: బ్యాంకులో నుంచి బయటకు వచ్చిన మహిళ చేతిలోని బంగారం, నగదు బ్యాగ్‌ను లాక్కొని పరారైన దుండగుడిని స్థానికులు పట్టుకున్న ఘటన ఘట్‌కేసర్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మౌలాళి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఆవుల విజయలక్ష్మి ఘట్‌కేసర్‌లోని సౌత్ ఇండియా బ్యాంకులో తాకట్టుపెట్టిన బంగారం విడిపించుకోవడానికి బ్యాంకుకు వచ్చింది. బ్యాంకులో డబ్బు చెల్లించి బంగారం తీసుకుంది. తిరిగి కొన్ని బంగారు ఆభరణాలను తాకట్టు పెడతానని బ్యాంకు సిబ్బందిని కోరగా బ్యాంకు సమయం ముగిసింది శుక్రవారం రావాలని సిబ్బంది తెలిపారు. 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.47,500 నగదు సంచిలో పెట్టి బయటకు వచ్చింది. ఆ క్రమంలో అప్పటికే బ్యాంకులో కాపుగాసిన రాజస్థాన్ జోగ్‌పూర్‌కు చెందిన హరిందర్(28) విజయలక్ష్మి చేతిలోని సంచిని లాక్కొని పరారయ్యాడు. ఆమె కేకలు వేయడంలో స్థానికుడు గుర్రం రమేశ్ మరి కొందరితో కలిసి దుండగుడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. యాదాద్రి జిల్లా బీబీనగర్‌లో ఉంటూ పెయింటింగ్ పనులు చేస్తున్నట్లు పోలీస్ విచారణలో తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా దుండగుడిని పట్టుకున్న రమేశ్‌ను, ఇతరులను బాధితులు అభినందించారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

కుషాయిగూడ: కాలనీల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ప్రభుదాస్ ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని మీర్‌పేట్, నర్సింహనగర్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం కార్పొరేటర్ విద్యుత్ అధికారులతో కలిసి కాలనీల్లో పర్యటించారు. త్రీఫేజ్ కరెంటు సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ఇబ్బందులు పడుతున్నామని కార్పొరేటర్, అధికారులకు వివరించారు. అలాగే కొన్నిచోట్ల కరెంటు పోల్స్ అవసరమున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

పైప్‌లైన్ పనుల్లో వేగం పెంచాలి



మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ పనుల్లో వేగం పెంచాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అధికారులను ఆదేశించారు. హనుమాన్‌నగర్ కాలనీలో జరుగుతున్న హెచ్‌డీ పైప్‌లైన్ పనులను గురువారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటిలో కలుషిత నీరు రాకుండా నూతనంగా లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా కాలనీలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుతో పాటు సీసీ రోడ్డు కూడా వేయిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు మురళి, శంకర్, వినోద్, సాయి, సందీప్, నవీన్, పవన్, బషీర్, వెంకటేష్, బాలమణి, కామేశ్వరి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు శుభాకాంక్షలు



తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌కు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యలపై కమిషనర్‌కు వినతి

బోడుప్పల్: బోడుప్పల్‌లో నెలకొన్న ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ల బృందం పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్పొరేషన్ పరిధిలో పలు సమస్యలు నెలకొని ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరినట్లు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు అభివృద్ధి పనుల కోసం తీర్మానం చేసి శంకుస్థాపన చేసిన పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. కార్పొరేటర్లు బింగి జంగయ్య యాదవ్, కొత్త స్రవంతి గౌడ్, తోటకూర అజయ్‌యాదవ్, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, కొత్త దుర్గమ్మగౌడ్, రాసాల వెంకటేశ్‌యాదవ్, నేతలు పులకండ్ల జంగారెడ్డి, తోటకూర శ్రీశైలం యాదవ్, గుర్రాల వెంకటేశ్‌యాదవ్, దానగల్ల యాదగిరి తదితరులున్నారు.

మున్సిపల్ సిబ్బందితో కార్పొరేటర్ సమీక్ష

కాప్రా: మున్సిపల్ పరిధిలోని అన్ని శాఖల సిబ్బందితో గురువారం కాప్రా డివిజన్ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పారిశుద్ధ్యం, విద్యుత్, నీటి సరఫరా, ఫాగింగ్ అంశాలపై ఆయా శాఖల సిబ్బందితో చర్చించారు. డివిజన్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఎస్వీనగర్‌లో రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు చేపట్టాలి

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని ఎస్వీనగర్ ఫేజ్–2 కాలనీలో రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను చేపట్టాలని కోరుతూ గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కాలనీ అధ్యక్షులు సీతాల వీరాస్వామి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ రిపేర్, మూతలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ప్రవీణ్, కాలనీవాసులు తదితరులున్నారు.

ఇద్దరు బాలురు అదృశ్యం

మల్కాజిగిరి: ఇద్దరు బాలురు అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కొండలు తెలిపిన వివరాల ప్రకారం.. బీజేఆర్‌నగర్‌కు చెందిన శోభారాణి సోదరి రాజమణి ఆమె భర్త మృతి చెందడంతో వారి పిల్లలు బన్నీ(14), సాయికుమార్(10) ఇద్దరూ శోభారాణి వద్దే ఉంటున్నారు. ఈ నెల 12వ తేదీ ఆడుకోవడానికి బయటకు వెళ్లిన ఇద్దరూ తిరిగి రాలేదు. ఈ ఘటనపై గురువారం రాత్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికలు హక్కుల గురించి తెలుసుకోవాలి



అల్వాల్: బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టాలని జిల్లా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ ప్రియాంక అన్నారు. బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు అరికట్టాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సంక్షేమం అధికారి ఎం.క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం మచ్చబొల్లారంలో బాలికల ఉన్నత పాఠశాలలో భేటీ బచావో.. భేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు తమ హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. పిల్లలు పోషకాహారం తీసుకొని భవిష్యత్‌లో పిల్లలు గొప్పగా ఎదగాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక చట్టాలు, పోక్సోచట్టం, చైల్డ్ లైన్, హెల్ప్‌లైన్ నంబర్ 100, 181, 1098, 14567పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ వాసవి, సవిత, ఫైనాన్సియల్ లీటరసీ శ్రావణి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి సహకరించాలి



ముఖద్వార భూమి పూజలో మేయర్

బోడుప్పల్: కాలనీల అభివృద్ధికి అందరూ సహకరించాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 15వ డివిజన్‌లోని అయోధ్యనగర్ కాలనీ ముఖద్వారం భూమిపూజ కార్యక్రమానికి బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ నిధులతో పాటు కాలనీ సంఘాలు సొంత నిధులతో మౌలిక కల్పన కోసం ముందుకు రావాలని కోరారు. అంతేగాకుండా పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, 15వ డివిజన్ ఇన్‌చార్జి సిగురు రేణుక రవికుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు కార్తికేయనగర్ బిడ్జి ప్రారంభం

మల్లాపూర్: నాచారం కార్తికేయనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన నూతన బ్రిడ్జిని శుక్రవారం ఉదయం 9 గంటలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ తెలిపారు. ప్రారంభోత్సవానికి నాచారం డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నేతలు హాజరుకావాలని కార్పొరేటర్ తెలిపారు.

బాలాజీ ఆలయం హుండీ లెక్కింపు

అల్వాల్: అల్వాల్ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయం హుండీ లెక్కింపు గురువారం జరిగింది. హుండీ లెక్కింపులో రూ.2 లక్షల 46వేల ఆదాయం వచ్చినట్లు ఆలయ వంశపరంపర్య చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సెంచర్, ఆలయ ఈవో ఎం.వీరేశం, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి సేవలను తిలకించి ధన్యులు కావాలని కోరారు. సామాజిక సేవకులు శివరామకృష్ణ, సురేందర్‌రెడ్డి, రాము, సిబ్బంది నరసయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ

గౌతంనగర్: రాచకొండ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సుదీర్‌బాబును గురువారం మల్కాజిగిరికి చెందిన బోనగిరి సురేష్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కమిషనర్ చేతులమీదుగా శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానానికి సంబంధించిన 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సురేష్‌యాదవ్, వీరాస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.